నవతెలంగాణ
1
ఆదిలాబాద్
గురువారం | నవంబర్ 28, 2024 | www.navatelangana.com

నేటి నుండి సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదల సమస్యల పరిష్కారంలో అండగా ఉన్న సీపీఐ(ఎం) భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 13వ జిల్లా మహాసభలు గురువారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజున సభ నిర్వహించడం..రెండో రోజు శుక్రవారం ప్రతినిధుల సభ జరగనుంది. ఇందులో రాబోవు మూడేండ్లలో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణపై పలు తీర్మానాలు ఆమోదించనున్నారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనున్నారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో పత్తి వ్యాన్ దగ్ధం

కౌటాల : పత్తి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ ముత్తంపేట్ ప్రధాన రహదారిపై షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బెజ్జూర్ నుండి మహారాష్ట్రకు వెళ్తుండగా కౌటాల స్టేడియం దాటిన తర్వాత ఇంజన్‌లో మంటలు వచ్చి పత్తికి అంటుకున్నాయి. సిఐ ముత్యం రమేష్, ఎస్ఐ మధుకర్ సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ నిలిపేశారు. దాదాపు రెండు గంటలపాటు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే పత్తి పూర్తిగా కాలిపోయింది. వాటర్ ట్యాంకర్లు అందుబాటులో లేకపోవడంతో పత్తికి మందు కొట్టే డబ్బాలతో నీళ్ల పట్టి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. తర్వాత మొత్తంపేట స్టోన్ క్రషర్ల నుండి వాటర్ ట్యాంకర్ తెప్పించి మంటలను అదుపు చేశారు. ఫైర్‌స్టేషన్ కేవలం 35కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఘటన జరిగిన స్థలానికి రావడానికి 2గంటలకు పైగా పట్టింది.



ఫలించిన పోరాటం..!

- రైతులతో చర్చలు జరిపిన జిల్లా కలెక్టర్
- పరిశ్రమ పనులు నిలిపివేస్తున్నట్లు ప్రకటన
- ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక
- రిలే దీక్షలు విరమించిన రైతులు.. గ్రామాల్లో సంబరాలు
- పొలాల కోసం ఏడాది పాటు ఉద్యమించిన రైతులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతుల పోరాటం ఫలించింది. పచ్చని పంట పొలాలను నాశనం చేసే ఇథనాల్ పరిశ్రమను ఇక్కడ్నుంచి తరలించేలా చేశారు. వారి జీవనాధారమైన పంట పొలాలను కాపాడుకున్నారు.సుదీర్ఘంగా సాగించిన పోరాటంలో చివరకు విజయం సాధించారు. రైతులు సాగించిన ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం ఈ పరిశ్రమ అనుమతులను రద్దు చేస్తామని పేర్కొంది. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకీ షర్మిల రైతులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమ పనులను నిలిపివేస్తున్నట్లు రైతులతో ప్రస్తావించారు. ఈ పరిశ్రమను రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వారికి చెప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పరిశ్రమను రద్దుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క హామీ మేరకు దీక్షలు విరమించినట్లు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలమంతా సంబరాల్లో మునిగిపోయింది. సుదీర్ఘంగా సాగించిన రైతుల పోరాటం విజయం సాధించింది. దీంతో చిన్నా పెద్దా తేడా లేకుండా ఏడాది పాటు సాగించిన ఉద్యమానికి ఫలితం దక్కినట్లయింది.

ఏడాది కాలంగా పోరాటం..!

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు ఆ మండలంలోని గుండంపల్లి గ్రామాల మధ్య 42 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమను నిర్మిస్తున్నారు. ఈ పరిశ్రమ నిర్మిస్తే చుట్టుపక్కల పంట పొలాలు పనికిరాకుండా పోతాయని..భవిష్యత్తులో వాటిలోకి వెళ్లలేని పరిస్థితి ఉంటుందని రైతులు తొలి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తు వస్తున్నారు. ఇది వరకే మహబూబ్‌నగర్ జిల్లా చిత్తనూరులో





దీక్ష విరమిస్తున్నట్టు కలెక్టర్‌కు రాతపూర్వకంగా అందజేస్తున్న రైతులు

ఇథనాల్ పరిశ్రమ ఉండటంతో అక్కడికి వెళ్లిన స్థానిక రైతులు పంట పొలాలను పరిశీలించారు. పొలాలు కలుషితం కావడం గమనించిన రైతులు ఈ పరిశ్రమ వద్దేవద్దని నినదించారు. ఏడాది కాలం నుంచి ఈ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. తొలుత దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టగా.. కొన్ని రోజులకు ఆ మండలంలోని అన్ని గ్రామాలు వీరికి తోడయ్యాయి. రైతులు పరిశ్రమను తరలించే వరకు ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తున్న రైతులు 129 రోజుల పాటు రిలే నిరహార దీక్షలకు దిగారు. తాజాగా కొన్ని రోజుల నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేసిన చేశారు. గ్రామాల నుంచి రైతులంతా రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో కొందరు రైతులపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిని ఎత్తివేయాలని మళ్లీ రైతులు పోలీసు స్టేషన్ ఎదుట పురుగు మందు డబ్బాలు చేతపట్టుకొని నిరసన తెలుపడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. చివరకు ప్రభుత్వం దిగొచ్చిన ఈ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జిల్లా ఎస్పీ జానకి షర్మిల రైతులతో చర్చలు జరిపారు. పరిశ్రమ పనులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఈ పరిశ్రమను రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు రైతులతో చెప్పడంతో రైతులు దీక్షలు విరమించేందుకు అంగీకరించారు. అనంతరం ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి ఈ విషయం చెప్పడంతో ఆయా గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. రైతులంతా కలిసి చేసిన పోరాటం ఫలించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నమ్మించి మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



జైపూర్ : నమ్మకంగా ఉంటూనే తన యజమానిని దగ్గర రూ.10లక్షలు కాజేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. భీమారంకు చెందిన ప్రయివేట్ కాంట్రాక్టర్ రాజేందర్ తన వ్యాపార అవసరాల నిమిత్తం జైపూర్ లో గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. రాజేందర్ వద్ద మహేష్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. నవంబర్‌లో రాజేందర్ రూ.10లక్షలు తన గదిలో పెట్టి పని నిమిత్తం బయటకు వెళ్లగా గమనించిన మహేష్ తన వద్ద ఉన్న ఇంకో తాళం చెవితో గదిలోకి వెళ్లి డబ్బులు దొంగిలించాడు. విషయం తెలుసుకున్న రాజేందర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ ఇందారం క్రాస్ రోడ్డు వద్ద మహేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. దొంగిలించిన డబ్బులో నుండి రూ.8,51,200, సెల్‌ఫోన్, తాళం చెవి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ వేణు చందర్, ఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

త్వరలో మిథనాల్ ప్లాంట్ ప్రారంభం

జైపూర్: ఎస్టిపిపిలో మిథనాల్ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఈడి ఎస్‌వి రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఎస్టీపీపీ భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిఎం వాసుదేవమూర్తి మాట్లాడుతూ ప్లాంటు పరిసర ప్రాంతాలలో పర్యావరణ స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం రాజశేఖర్‌రావు మాట్లాడుతూ త్వరలోనే కార్బన ఉద్గారాలను తగ్గించడానికి మిథనాల్ ప్లాంటును ప్రారంభిస్తామన్నారు. షరతులకు లోబడి ప్లాంటులో వివిధ రకాల పనులు చేపడుతున్నామన్నారు. ఈ ప్లాంటు ద్వారా మరింత కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. జూన్ 2024లో పర్యావరణానికి సంబంధించి నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిఎం (పిసిఎస్) కె.శ్రీనివాసులు, జేఎస్. సింగ్, ఏజీఎం(సివిల్) కేఎస్‌ఎన్.ప్రసాద్, ఏజీఎం(ఫైనాన్స్) టి.సుధాకర్, ఏజీఎం(ఈఅండ్ఎం) మదన్‌మోహన్, పిఎమ్ పీఎల్ ప్లాంట్ హెడ్ అఖిల్ కపూర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్‌సింగ్, పవర్ మేక్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గిరిజన ప్రాంతాల్లో పర్యటన



నేరడిగొండ : మండలంలోని లక్ష్మీపూర్, పీచర, నాగ మాల్యాల్ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో రచ్చబండ వద్ద కూర్చొని గ్రామస్తులతో ముచ్చటిస్తూ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు, యువకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికే పర్యటనలు చేస్తున్నానని తెలిపారు. ప్రధానంగా మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా లేకపోయినా గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశానని, ఇప్పుడు ఎమ్మెల్యేగా తనపై బాధ్యత కూడా ఉందని తెలిపారు. కచ్చితంగా అడిగిన సీసీ రోడ్లు, ఇతర సమస్యలను వీలైనంత త్వరగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తుల కోరిక మేరకు 2రోజుల క్రితమే గ్రామంలో రెండు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సురేందర్, సంతోష్ పాల్గొన్నారు.

సభలో పాల్గొనడానికి అనుమతివ్వండి



ఆదిలాబాద్‌టౌన్: నవంబర్ 28న తమ సీఐటీయూ యూనియన్ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ సభలో ఉద్యోగులు కార్మికులు పాల్గొనడానికి అనుమతి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి అన్నారు. ఈ విషయమై బుధవారం సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని విద్యానగర్‌లో బాసెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం(సీఐటీయూ జిల్లా కార్యాలయం) నిర్మించుకోవడం జరిగిందన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 28న జరుగుతుందని, దీనికి కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. యూనియన్‌లో ఉన్న ఉద్యోగులు కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మెరుగు జనార్ధన్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లింగంపల్లి శ్యామ్, ఈరగోల రవీందర్, కేఎల్ కుమార్, పి.దయానంద్ ఉన్నారు.

ఏండ్ల కల..నెరవేరిన వేళ..!

- నేడు ప్రారంభం కానున్న సీఐటీయూ కార్యాలయం
- ఉదయం 11గంటలకు బహిరంగ సభ
- హాజరుకానున్న రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకరత్
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా నాయకత్వం
- జిల్లా కేంద్రంలో కదం తొక్కనున్న కార్మికవర్గం

కార్మికుల కష్టం ఫలించింది. భవనం నిర్మించాలనే ఏండ్ల కల నెరవేరింది. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకు వారధిగా ఉండేందుకు శ్రమకోర్చి నిర్మించిన సీఐటీయూ కార్యాలయం గురువారం ప్రారంభంకానుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకరత్ హాజరుకానున్నారు. కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌ బీ అతిథి గృహం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు సీఐటీయూ జాతీయ, రాష్ట్ర నాయకత్వం హాజరుకానుంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్‌తో పాటు మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర బాధ్యులు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు జిల్లా నాయకత్వం ఈ సభలో పాల్గొననుంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మిక ఉద్యమాలకు వారధిగా ఉన్న సీఐటీయూ సంఘానికి భవనం అత్యవసరమైంది. కార్మికుల పక్షాన అనేక పోరాటాలు, ఉద్యమాలు చేపట్టి వారి విజయంలో కీలకపాత్ర పోషించిన ఈ సంఘానికి భవనం ఉంటే మరింత బాగుంటుందని.. భవిష్యత్తు కార్యాచరణకు బలం చేకూరుతుందని భావించారు. కార్మికవర్గం తలో చేయి వేసి ఆర్థిక సాయం అందించింది. ఇందుకు అభ్యుదయ వాదులు సహకారం అందించారు. ఫలితంగా కొన్ని నెలలుగా సాగుతున్న ఈ భవన నిర్మాణం తాజాగా పూర్తికావచ్చింది. భవిష్యత్తు అవసరాలకు సరిపడా వివిధ సంఘాల కార్యకలాపాలతో పాటు విజ్ఞాన కేంద్రంగా మలచాలనే ఉద్దేశంతో సీఐటీయూ నాయకత్వం ఈ భవనాన్ని తీర్చిదిద్దింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం.. కార్మికుల హక్కులను కాపాడటంలో భవిష్యత్తు ఉద్యమాలను నిర్మించేందుకు దోహదం చేయనుంది. ఈ భవన నిర్మాణంలో అంగన్‌వాడీ, ఆశా, రిమ్స్, మెడికల్ అండ్ హెల్త్, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ కార్మిక సంఘం, వీఓఏలు, మధ్యాహ్న భోజన సంఘం తదితర సంఘాలన్ని ఏకమై ఈ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందించడంతో ఏండ్ల నాటి కల సాకారమైంది.

కదంతొక్కనున్న కార్మికవర్గం..!

సీఐటీయూ కార్యాలయం ప్రారంభం సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు భారీ ఎత్తున కార్మికవర్గం తరలిరానుంది. జిల్లా కేంద్రంలో ఉదయం 10.30గంటలకు భవనం ప్రారంభం కాగానే జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నారు. ఇందుకు కార్యాలయం వద్ద నూతన హంగులు ఏర్పాటుచేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో సీఐటీయూ జెండాలను అలంకరించారు. ఆర్‌అండ్‌బీ ప్రాంగణం ఎరుపు మయం సంతరించుకుంది. తొలిసారి ఆదిలాబాద్‌కు వస్తున్న జాతీయ నాయకురాలు బృందాకరత్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది.

వంట గదిలో పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- కేజీబీవీ ఆకస్మిక తనిఖీ, పిల్లలతో భోజనం
- ఆహార పదార్థాల పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కేజీబీవీని సందర్శించారు. ముందుగా గూగుల్ మీట్ ద్వారా ఆర్‌డీఓ, సీఈఓ, డీఆర్‌డీఓ, ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ తదితరులతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ, సీఎం కప్, ప్రజాపాలన విజయోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్స్, స్కూల్స్‌లలో భోజనం వండడానికి ముందే ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతా లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, వాటి కాలపరిమితిని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, భోజనం నాణ్యతను పరిశీలిస్తున్నారా అని ఎస్ఓ రజితను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసినట్లైతే ప్రత్యేక అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఆహార పదార్థాల నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి వసతి, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా సౌకర్యాల లేమి ఉన్నట్లయితే ప్రతిపాదనలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఎలా ఉంది, ఇంకా ఏమైనా అవసరం ఉన్నాయా, భోజనం ఎలా వుంది, అని అడిగారు. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ధర్నా

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎబివిపి ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర రహదారిపై బుధవారం ధర్నాకు దిగారు. వారికి మద్దతుగా బీజెపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి 35కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలో ప్రభుత్వం డిగ్రీ కాళశాల లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులు చదువుకుంటున్నారని, రెండు సంవత్సరాలుగా అధికారులు కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి బేలకు విద్యార్థులు వస్తుంటారన్నారు. మొత్తం 506 మంది విద్యార్థుల్లో 400 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. వీరు ఉదయం ఇంటి నుండి చలిలో ఎలా వెళ్తారని, మళ్లీ తిరిగి రావాలంటే ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. వెంటనే పరీక్ష కేంద్రాన్ని బేలలో ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రఘునందన్‌రావ్‌ను కలిసి సమస్య వివరించారు. దీనికి ఆయన కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు దత్త నిక్కం, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్, జనరల్ సెక్రటరీ సందీప్ ఠాక్రే, ఓసు మనోజ్‌రెడ్డి, అజయ్, జీవన్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడదాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యమస్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడదామని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి అధ్యక్షతన తన నివాసంలో ఈనెల 29న నిర్వహించే దీక్ష దివస్ సన్నాహక సమావేశానికి జిల్లాలోని ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో మలిదశ ఉద్యమంలో కేసీఆర్ ఎంతో కీలకంగా పాల్గొని ఉద్యమాలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఉద్యమ స్ఫూర్తి తగిలించకపోవడంతో 2009లో కెసిఆర్ సాహసపేతమైన నిర్ణయం తీసుకొని నిరవధి నిరాహార దీక్షకు పూనుకొని తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఉద్యమాన్ని ఉవ్వెత్తిన రగిలించి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి ప్రతి గొంతుక తెలంగాణ నినాదంతో పోరాటం చేసేలా చేయడం జరిగిందన్నారు. సాధించిన తెలంగాణలో 10 సంవత్సరాలు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లిన కేసీఆర్ ఈ పది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ప్రజలే బహిరంగంగా చర్చించుకుంటున్న సందర్భం వచ్చిందన్నారు. ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ మాట్లాడుతూ దోకాబాజీ హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్లు అలీబిన్ అహ్మద్, సంజీవ్, మాజీ జడ్పిటిసిలు అజయ్ కుమార్, దుర్పదాబాయి, మాజీ ఎంపీపీ సౌందర్య, నాయకులు అన్సార్, రవి, సాజిద్, రవీందర్, యూనుస్, కలాం, హకీం పాల్గొన్నారు.



నవతెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | నవంబర్ 28, 2024 | www.navatelangana.com

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-నార్నూర్



విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ జవహర్ లాల్, తహసీల్దార్ రాజలింగం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోనీ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వండిన మధ్యానం భోజనం అన్నం పప్పు గుడ్డును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ప్రధానోపాధ్యాముడు, భోజన కార్మికుని ఆదేశించారు.

ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయం

నవతెలంగాణ-భైంసా



వైద్యులు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో ఆరాధన ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాజారెడ్డి, వైద్యురాలు స్నేహ రెడ్డి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆమె సత్కరించి మాట్లాడారు. పేదలకు బీపీ షుగర్ పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినందుకు గ్రామస్తుల తరఫున ఆమె ధన్యవాదాలు తెలిపారు. కొంత సమయాన్ని వైద్యులు ప్రజాసేవకు వెచ్చించడం శుభ పరిణామన్నారు. మన ప్రాంతంలో ఆయుర్వేద ఆస్పత్రి ఉండడం, దూర ప్రాంతాల నుండి రోగులు సైతం ఇక్కడికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని, అదానీ, అంబానీ వంటి పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపారవేత్తలకు మద్దతుగా విధానాలను అవలంబిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అత్యవసర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దేశంలో కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ కోడ్‌లను రద్దు చేయాలని ఎన్నో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రధాని మోడీ కార్మిక వ్యతిరేకి అంటూ దుయ్యాబట్టారు. ఈ చర్యను కార్మికవర్గం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, ఆఫీస్ బేరర్స్ మంతెన కాంతారావు, కీర్తి రమణ, ఏ.చంద్రకళ, కల్లేపల్లి గంగయ్య, వై ఆశన్న, గాజంగుల రాజు, ప్రవీణ్ రెడ్డి, కూన గోదావరి, ఎస్కే అలాం పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సర్వే డాటాను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలనీ డీఎల్పీఓ ప్రభాకర్ కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. డాటా ఎంట్రీ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జవహర్ లాల్, ఎంపీఓ స్వప్న షీలా, సుపరింటెండెంట్ గంగాసింగ్, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

నేడు జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రముఖ సంఘసంస్కర్త బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే 134వ వర్ధంతి ఈనెల 28న నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పెట్కూలే, సాంబన్న షిండే బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలో గల పూలే దంపతుల విగ్రహాల ముందు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలీ కులస్తులు పూలే విగ్రహాలు ఉన్న ప్రతి చోట వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి పూలే దంపతుల సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక న్యాయం, సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు.

రేపు అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద బహిరంగ వేలం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి గాంచిన అడెల్లి శ్రీమహా పోచమ్మ దేవాలయం సన్నిధిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు టెంటు సామాను, వంట పాత్రలు కిరాయికి ఇచ్చేందుకు హక్కు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలపరిమితి ఉంటుందని ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డుతో పాటు రూ.75 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చనని తెలిపారు.

క్రమం తప్పకుండా టీకాలు తీసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో పీహెచ్ఎన్ఓ సుశీల, ఏఎన్ఎం శిలా, ఆశా ఆడే పంచుబాయి ఉన్నారు.

ఆదిలాబాద్ డీఎల్ఎస్ఏలో ఉద్యోగాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కోర్టులోని డీఎల్ఎస్ఏలో పలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏలో స్టెనో, టైపిస్ట్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తులను డిసెంబర్ 5 వరకు రిజిస్టర్ పోస్ట్, కొరియర్ ద్వారా పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్టెనో (1) రికార్డు అసిస్టెంట్ (1) జనరల్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- నాయకులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలనీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద నిర్వహించనున్న సభ ఏర్పాట్లను బుధవారం సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ నెల 28న ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కార్యక్రమ ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృంద కారత్‌తో పాటు సీఐటీయూ ఆల్ ఇండియా నాయకులు సాయిబాబ, సీపీఎం మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబురావు, చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం పది గంటలకు కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం ర్యాలీగా బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకోనున్నట్లు వివరించారు. సభలో భాగంగా ప్రజా, కార్మిక, కర్షక సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరనను నిర్ణయించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులున్నారు.

ఇంద్రవెల్లి : జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిన్స్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ బహిరంగ సభ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 28న బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనికి మాజీ రాజ్యసభ సభ్యులు బృందా కారత్, మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక పోరాటాల సారథి ఐక్య ఉద్యమాలవారధి కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా కార్యాలయం ప్రారంభమనేది జిల్లా కార్మిక వర్గానికి పండుగలాంటిదన్నారు. ప్రభుత్వాల కార్మిక ప్రజాకర్షక వ్యతిరేక విధానాల పైన పోరాడే వారికి కేంద్రంగా పనిచేస్తుందని, భవిష్యత్తు జిల్లా కార్మికవర్గ ఉద్యమాలకు వేదికగా నిలబడుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు కార్మికులు ప్రజలు కర్షకులు, ఆదివాసులు, కార్మిక ఉద్యమ శ్రేయోభిలాషులు వేలాది సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కత్తి మల్లమ్మ, మండల నాయకులు మీరాబాయి, లక్ష్మీకాంత్, సంజీవ్, రాందాస్, దిలీప్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-తలమడుగు



రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.స్వామి డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనేతర పనుల వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా వెనుకబాటుకు గురవుతోందని, 15 రోజుల నుంచి సర్వే పేరున ఒక పూట మాత్రమే బడి నడుస్తుందన్నారు. సర్వే పూర్తయిన అనంతరం ఆన్‌లైన్ పేరిట మరో 15 రోజులు సమయం తీసుకోవడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని తెలిపారు. కుల గణన ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రణాళిక శాఖ ద్వారా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకొని, ప్రాథమిక ఉపాధ్యాయులందరినీ పూర్తి కాలం బోధనకు అంకితం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యకుమార్, జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, మండల బాధ్యులు శంకర్, గంగాధర్, గణేష్, అశోక్, ఓ.అశోక్, సురేష్, విజయ్, రవీందర్, భీంరావు, నాగేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- ప్రధాని మోదీని కోరిన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్
- బాసర అమ్మవారి దర్శనానికి రావాలని వినతి



నవతెలంగాణ-భైంసా

ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. బుధవారం తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఢిల్లీ బయలుదేరిన సందర్భంగా ప్రధాన మంత్రిని కలిసి నిధులు ఇవ్వాలని కోరారు. ముధోల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, బీజేపీ ఎమ్మెల్యేలున్న చోట కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తుందని, కేంద్ర నిధులు ఇచ్చి తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన చదువుల తల్లి బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. సీఎస్ఆర్ నిధులు, అంతర్ రాష్ట్ర రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు ఉపాధి హామీలో పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వాలని విన్నవించారు. మోడీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను కేంద్రమంత్రికి ఎమ్మెల్యే పటేల్ దృష్టికి తీసుకువచ్చారు. పీఎంతో పాటు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

అల్పాహారం కలుషితం కాకుండా చర్యలు

- డిసెంబర్ 7 నుండి సీఎం కప్ పోటీలు
- అధికారులతో కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీ, పోషణ్ చర్చ, సీఎం కప్, ప్రజాపాలన విజయోత్సవాలపై అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్స్, పాటశాలలో భోజనం వండడానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యత లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. డిసెంబర్ 7 నుండి సీఎం కప్ పోటీలు గ్రామీణ ప్రాంతాలలో క్రీడా ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణా ఆధ్వర్యంలో నాలుగు దశలుగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 7, 8 గ్రామ పంచాయితీ లెవెల్‌లో మండలాల్లో 10 నుండి 13వ తేదీ వరకు, జిల్లా లెవెల్‌లో 16 నుండి 21 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ, మండల, జిల్లా లెవెల్‌లో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రజాపాలన విజయోత్సవాలు సందర్భంగా డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించాలని ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సంవత్సరం లోగోను అన్ని శాఖలలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ, సీఈఓ జితేందర్‌రెడ్డి, డీఆర్డీఓ, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంఈఓ ఉన్నారు.

పరస్పర ఒప్పందంతో కేసులు పరిష్కరించుకోవాలి

- డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీమార్గమే రాజమార్గమని, పరస్పర ఒప్పందంతో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం తన ఛాంబర్‌లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. సమస్యల నుండి శాశ్వతంగా ఉపశమనం పొందాలని సూచించారు. సత్వర కేసుల పరిష్కారంతో సమయం ఆదా కావడంతో పాటు మానసికంగానూ కొంతవరకు ఒత్తిడి తగ్గుతుందని తెలియజేశారు. లోక్ అదాలత్‌లో అన్నిరకాల సివిల్ కేసులు, వైవాహిక కేసులు, బ్యాంకు కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే బ్యాంకు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత భవిష్యత్తును పొందాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో బుధవారం పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. శ్రీకాంత్ రెడ్డిపై అభిమానంతో ముద్రించిన టీషర్టులను ఆవిష్కరించి వారికి ఆల్ ది బెస్ట్ తెలిపారు. అనంతరం గాంధీ టీమ్ క్రికెట్ సభ్యులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు కృషి చేస్తోందన్నారు. క్రికెట్‌పై మక్కువతో ఎంతో మంది జిల్లా నుండి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సైతం ప్రతిభ కనబర్చడం జరిగిందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయినవారు మరింత శ్రమించి విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు అఫన్ అహ్మద్, మహమ్మద్, అంకుష్, అరవింద్, కన్నయ్య షేక్ మొహమ్మద్, నరేష్ పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

నవతెలంగాణ-తాంసి

గోపాల మిత్ర పరిధిలోని జామిడి గ్రామంలో బుధవారం జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ఈఓ డీఎల్‌డీఏ రామారావు రాథోడ్ పాల్గొని జాతి దూడల ప్రదర్శన నిర్వహించి దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి చికిత్స చేశారు. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు. ఈ సందర్భంగా డా.రామారావు రాథోడ్ మాట్లాడుతూ పశుపోషకులు పాడి పశువులను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి: డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది సతీష్, గోపాల మిత్రులు ప్రవీణ్ కుమార్, కొట్రంగి మల్లికార్జున్, నవీన్, శ్రీను, అజయ్, రైతులు గంగారెడ్డి, వినోద్ రెడ్డి, శుభాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త మండలాల ఏర్పాటుపై హర్షాతిరేకాలు



నవతెలంగాణ-జైనథ్

రాష్ట్రంలో కొత్తగా 32 మండలాలను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగానే రాష్ట్ర ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.నూతన మండలాల జాబితాలో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల పరిధిలోని సొనాల, జైనథ్ మండల పరిధిలోని భోరజ్, సాత్నాల పేర్లు కూడా ఉండడంతో ఆయా కొత్త మండలాల పరిధిలోని గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. భోరజ్, సాత్నాలలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామాల బస్టాండ్ వద్దకు చేరుకొని టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం తీపి కబురు అందించిందని మిఠాయిలు తినిపించుకున్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్ రావు, గ్రామస్తులు గన్నాజీ రాజేశ్వర్, తుకొరెడ్డి భూమన్న, పొద్దుటూరి నారాయణ, అల్చెట్టి రాజారెడ్డి, శరత్, దిలీప్ రెడ్డి, భగవాన్ దాస్, గంగన్న, సురేష్ రెడ్డి, కుర్మ చిన్నయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు

నవతెలంగాణ-రెబ్బెన



గోలేటిలోని జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్ట్ మెంట్‌లో సింగరేణి ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన, ఇతర ఏరియాల నుండి బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన ఏడుగురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగుల నివాస గృహాల కేటాయింపు పారదర్శకంగా సాగుతుందని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ(సివిల్) మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అర్చన పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-కౌటాల



రైతులు వారి పంటల వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్ దగడ్ గ్రామ శివారులో గల నిర్దేశించిన సర్వే నంబర్స్‌లో పంటల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటు వ్యవసాయ శాఖ తరపున అందించే సేవల గురించి తెలియజేశారు. పంటల నమోదు వల్ల వ్యవసాయ విస్తరణ అధికారులు పంటలు ఆన్‌లైన్ పోర్టల్ కచ్చితంగా నమోదు చేశారా లేదా అనే విషయం తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జి. కవిత, జి. ఘన్‌శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన జర్పుల శ్రీకాంత్ (22) పోతేపెల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదుపుతప్పి టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలంగా గాయమైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీకాంత్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంపీడీఓ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను బుధవారం ఎంపీడీఓ అల్బర్ట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని ఎస్ఓ కవితకు సూచించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా, మురుగునీరు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మద్యానికి బానిసై పట్టణంలోని సందీప్ నగర్‌కు చెందిన మడావి విజయ్ కుమార్(38) మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ప్రయివేటు ఉద్యోగం చేస్తున్న విజయ్ కుమార్ తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం రాత్రి తాగుడుకు తన అక్కా బావలను డబ్బులు అడగగా నిరాకరించడంతో ఇంట్లోకెళ్లి దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన మృతుడి సోదరి కిందికి దించి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉద్యోగికి విరమణ సర్వసాధారణం



నవతెలంగాణ-కౌటాల

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సర్వసాధారణమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్ దగడ్ ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన పొర్తేటి హన్మంత్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమంలో ఉఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయన్నారు. విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, దివంగత బీఆర్ఎస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మహమూద్ సేవలు మరువలేనివని ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్ అన్నారు. ఎండీ మహిమూద్ 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో మహమూద్ ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ స్థాపించారన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అన్వార్, నాయకులు జాకీర్ హుస్సేన్, సుధాకర్, ముజాహిద్, ఎండీ ఇమ్రాన్, గౌస్ ఖాన్, ఖలీల్, మతిన్, శ్రీను, మున్ను పాల్గొన్నారు.

మాల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించే మాల సింహగర్జన పోస్టర్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారదాసు లక్ష్మణ్‌తో పాటు మాల మహానాడు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ మాలల ఆత్మ గౌరవం ప్రధానంగా సాగుతున్న సింహగర్జన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు ప్రధాన కార్యదర్శి సొల్లు లక్ష్మి, రెబ్బెన అధ్యక్షుడు నామాల సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనజ పాల్గొన్నారు.



శైలజ కుటుంబానికి మద్దతుగా కదిలిన విద్యార్థులు

- విద్యాసంస్థల బంద్ విజయవంతం
- కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- ఉన్నతాధికారుల సస్పెన్షన్‌కు డిమాండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో మరణించిన శైలజ కుటుంబానికి మద్దతుగా విద్యార్థి, ప్రజా, యువజన సంఘాల నాయకుల పిలుపుమేరకు విద్యార్థులు తరలివచ్చారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విద్యార్థి ప్రజా యువజన సంఘాల ఇచ్చిన విద్యాసంస్థల బంధు పిలుపు విజయవంతమైంది. ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు ముందస్తుగా సెలవులు ప్రకటించగా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను వివిధ సంఘాల నాయకులు వెళ్లి బంద్ చేయించారు. జిల్లావ్యాప్తంగా బంద్ విజయవంతమైంది.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

శైలజ మృతికి నిరసనగా వివిధ సంఘాల నాయకులు ఇచ్చిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ముందస్తుగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులు కలెక్టరేట్‌లోనికి వెళ్లడానికి ప్రయత్నించగా అడ్డుకున్నారు. కలెక్టరేట్ ఎదుట కూర్చుని ధర్నా నిర్వహించారు. దీంతో పోలీసులు సంఘాల నాయకుల మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది.

ఉన్నతాధికారుల సస్పెన్షన్‌కు డిమాండ్

శైలజ మృతికి ఇప్పటికే పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు నలుగురిని సస్పెండ్ చేయగా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారితో పాటు ఏటీడీఓను కూడా సస్పెండ్ చేయాలంటూ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ధర్నా తర్వాత కొంతమంది నాయకులు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు ఇదే విషయంపై వినతిపత్రం అందజేశారు. శైలజ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు మాలశ్రీ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రావణి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, మాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు మెంగాజీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, వివిధ సంఘాల నాయకులు శ్రీకాంత్, మారుతీ, రాజ్ కుమార్, సోమేశ్వర్, వికాస్, మహేష్, రాకేష్, సతీష్, భీంరావు, పురుషోత్తం, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే యత్నం చేస్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కౌటాల : శైలజ మృతిపై అధికారుల, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. మండలంలో ఉన్న విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దుర్గం అనికేత్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు దయనీయస్థితిలో నడుస్తున్నాయని, అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణమన్నారు. వాంకిడి ఘటన జరిగి నెలల సమయం గడిచినా విద్యార్థిని ప్రాణాలు కాపడక పోవడం ఏంటని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ మొదటి నుండి విద్యార్థినికి కార్పోరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పరామర్శలకే పరిమితమయ్యారు తప్ప విద్యార్థిని ప్రాణాలు కాపడలేకపోయారని మండిపడ్డారు. సరైన వైద్యం అందిస్తే విద్యార్థిని బ్రతికేదని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎలుములె సాయినాథ్, ఉమేష్, అఖిల్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని డాబా గ్రామానికి చెందిన చౌదరి శైలజ మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపు నిచ్చాయి. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాటు మాలీ సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుండే వ్యాపార సంస్థలు, పాన్‌షాపులు, హోటళ్లు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వాంకిడి పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. బంద్ పాటించిన అన్ని సంస్థలకు విద్యార్థి సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రెబ్బెన : వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని చౌదరి శైలజ మృతికి నిరసనగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని శైలజ మృతి చెందిందన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.5 లక్షలు, 5 ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, మండల అధ్యక్షులు జాడి శ్యామ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : వాంకిడి మండలంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ నాసిరకమైన సరుకుల పంపిణీ వలన జరిగిందని మాలీ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండలంలో విద్య సంస్థల బంద్ విజయవంతం అయింది. వాంకిడి ఘటన జరిగి నెల రోజులు గడిచినా విద్యార్థిని ప్రాణాలు కాపడకపోయారని ఆరోపించారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరవృతం కాకుండా ఉండాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు పరమేశ్వర్, గణపతి, రామయ్య, శ్యామ్ రావు, సునీల్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కౌటాల



వాంకిడి



సిర్పూర్(టి)

భర్తను చంపిన భార్య అరెస్ట్

- హత్యకు ఉపయోగించిన క్రికెట్ బ్యాట్ స్వాధీనం



హత్య వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న క్రికెట్ బ్యాట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ బెంగాళీ క్యాంప్ నెం.2లో భర్తను చంపిన భార్యను అరెస్ట్ చేసినట్టు కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఈజ్‌గాం ఎస్ఐ మహేందర్ తెలిపారు. సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు హత్య వివరాలు వెల్లడించారు. బెంగాళీ క్యాంప్ నెం.2కు చెందిన సరస్వతి సర్కార్, దులాల్ సర్కార్ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులుండగా భార్య భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. దులాల్ సర్కార్ కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. మద్యం తాగినపుడల్లా భార్య మందలిస్తుండడంతో తరచుగా ఆమెతో గొడవపడేవాడు. తన భర్త వేధింపులు భరించలేక సరస్వతి సర్కార్ తన భర్తను చంపాలని నిర్ణయించుకుంది. ఈ నెల 26న భర్త దులాల్ సర్కార్ మద్యం తాగి ఇంటికి రాగా మళ్లీ వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహం చెందిన సరస్వతి సర్కార్ పిల్లలు ఆడుకునే క్రికెట్ బ్యాట్‌తో భర్త తలపై కొట్టడంతో దులాల్ సర్కార్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితురాలైన సరస్వతి సర్కార్‌ను బుధవారం మధ్యాహ్నం విలేజ్ నెంబర్ 1లోని మీ సేవా కేంద్రం వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ, ఎస్ఐలు వివరించారు. ఆమె నుండి హత్యకు ఉపయోగించిన క్రికెట్ బ్యాట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌కు అధిక కేసులు వచ్చేలా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి న్యాయవాదులు, పోలీసు అధికారులు, అటవీ అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలని, కేసులను రాజీకి వచ్చే విధంగా చేయడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చని తెలియజేయాలని, సంబంధిత స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టికి సారించాలన్నారు. సైబర్ క్రైమ్ కేసులు అధిక సంఖ్యలో రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, కేసులలో రాజీ కుదుర్చుకోవడానికి ఇష్టపడి అందుబాటులో లేనివారు ఫోన్‌లలో కూడా రాజీ కోసం సంప్రదించవచ్చని తెలిపారు. దీనికోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌ల సిఐలు, అడ్వకేట్లు రాజీవ్ రెడ్డి, గణేశ్, పోలీసు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు తగిన చికిత్స చేయించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైతులు పశువులకు సకాలంలో వైద్యం అందించాలని, పశువులను కట్టివేసే కొట్టం చుట్టుపక్క ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని మండల పశు వైద్యాధికారిణి భవిత అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్‌రావ్‌పేట్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెర్టిలిటీ క్యాంపు ఏర్పాటు చేశారు, ఈ క్యాంపులో ఆవులకు గేదెలకు చూడు పరీక్షలు చేశారు. ఈ క్యాంపులో ఆవులు 24, గేదెలు 62, ఎద్దులు 12, మేకలు 14లకు చికిత్స చేశారు. అనంతరం కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడదూడలు మాత్రమే పుడతాయని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర జిల్లా సూపర్‌వైజర్ చిపెల్లి, రమేష్, గోపాల మిత్రులు చిపెల్లి, భాస్కర్ ఎమూర్ల, రాజేశ్వర్, డోంగ్రే, ప్రకాష్, జూండి, నాందేవ్ పాల్గొన్నారు.



మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా బాలికల పాఠశాల ఆకస్మికంగా సందర్శించి వంటశాల, గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, సామాగ్రి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, వంట చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులను వినియోగించాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలలో భోజన వసతి సదుపాయాలు మెరుగ్గా ఉండేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం, ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా పాఠశాల హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్ విద్యార్థులను అభినందించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీలలో మంచి నైపుణ్యంతో ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తాను స్వతహాగా హ్యాండ్ బాల్ క్రీడాకారుడిని విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి, ఏటీడీఓ చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు జంగు, గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి మీనారెడ్డి, వార్డెన్ సాయిబాబా, క్రీడా పాఠశాల కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్ పాల్గొన్నారు.



హామీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికీ ప్రజలను మభ్య పెడుతూ వస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సిర్పూరు తాలూకా సంస్థాగత కార్యశాలను నిర్వహించారు. దీనికి జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి అరుణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాలలో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించడానికి కూడా వెళ్లనీయకుండా బీజేపీ నాయకులను అడ్డుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ, తాలూకా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | నవంబర్ 28, 2024 | www.navatelangana.com

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం



జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. బీహార్‌కు చెందిన చింటు కుమార్ మండలంలోని మొర్రిగూడ గ్రామ శివారులో ఉన్న ఒక పరిశ్రమలో వారం రోజుల క్రితం పనికి చేరాడు. అయితే అతడు తాగుడుకు అలవాటు పడి పని చేయడం ఇష్టం లేక ఆ పరిశ్రమ పక్కనే ఉన్న గెస్ట్ హౌస్ ముందు ఉన్న గేటుకు తన టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చింటూ కుమార్ ఫోన్ చేసి తనతో కూలి పని చేయడం జీవితంపై విరక్తి పుడుతుందని మాట్లాడారన్నారు. మతుని అన్న కమల్ పాశ్వాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సింగరేణి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ ప్రభావిత గ్రామమైన గోండుగూడెంలో సీఎస్ఆర్ పథకం కింద సుమారు రూ.50 వేల విలువ గల 5 కుట్టు మిషన్లను సింగరేణి ఆధ్వర్యంలో అందించారు. గోండుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మందమర్రి ఏరియా జీఎం జి దేవేందర్ హాజరై గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, గోండుగూడెం గ్రామ పెద్దలు అచ్యుతరావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసి ఎంపీ వంశీకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

నిజామాబాద్-జగ్దల్‌పూర్ మధ్య చేపట్టిన జాతీయ రహదారి నెం.63 పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కోరారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ మంత్రిని కలిసి రహదారి పనులను గుర్తు చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భీమారం-కిష్టంపేట్ మధ్యన జోడు వాగు వద్ద విస్తరణ పనులను ప్రస్తావించారు. ఆక్కడ చేపట్టిన పనుల జాప్యం కారణంగా రాకపోకలకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. త్వరగా పనులు పూర్తి చేసేవిదంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిదంగా ఏపీ ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ కలిసి తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ భక్తులకు సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరారు.

వాసవి మాత ఆలయంలో ధ్యాన శిక్షణ తరగతులు

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో సంఘమిత్ర ధ్యాన కేంద్రం నిర్వాహకులు లక్ష్మణ్ మాస్టర్ ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ప్రశాంత చేకూరుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా ధ్యానం చేస్తూ శాఖాహారాన్ని తీసుకున్నట్లయితే మానసిక, శారీరక రుగ్మతలు దూరమవుతాయనన్నారు. ధ్యానం చేయడానికి వయసుతో సంబంధం లేదని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగులు వృద్ధులు మహిళలు తీరిక సమయాల్లో ధ్యానం చేస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు. రాచర్ల వాణి సురేష్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయూత



నవతెలంగాణ-జన్నారం

ప్రముఖ వ్యాపారవేత్త రామకృష్ణ ట్రేడర్స్ యజమాని, వావిలాల రాజేందర్ కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 ట్యూబ్ లైట్‌లు అందజేశారు. అదేవిదంగా 10 ఫ్యాన్‌లు విరాళంగా అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు సతీష్, పదవ తరగతిలో 10 జీపీఏ వస్తే అన్ని ఫ్యాన్‌లు డొనేట్ చేస్తానన్నారు. ఇప్పటి అవసరాల దృష్టిలో పెట్టుకొని రెండు ఫ్యాన్‌లు ఇస్తున్నట్టు ప్రకటించారు. అలాగే పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ 20 ఫ్యాన్‌లు, జోనల్ చైర్మన్ అంజిత్ రావు 5 ఫ్యాన్‌లు మల్లేష్ 2 ఫ్యాన్స్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి మురళి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కళకళలాడిన బుగ్గ శివాలయం

నవతెలంగాణ-తాండూర్

కార్తీక మాసం సందర్భంగా బెల్లంపల్లి బుగ్గ ఆలయం కళకళలాడింది. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ బుధవారం ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల బిక్ష అన్నదాన కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, సీఐ కుమారస్వామి తోపాటు స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు. పకృతి సోయగాల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శాఖాహార వంటలను పిల్లలు పెద్దలు మహిళలు అయ్యప్ప స్వాములు ఆరగించారు. అన్నదాన కార్యక్రమంలో నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. సాయంకాలం పడిపూజ భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, మహేందర్‌రావు, ఉమారాణి, ఎంపీటీసీ శ్రీదేవి, కాపర్తి సుభాష్, మాదారం ఎస్ఐ సౌజన్య పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి రాజేంద్ర పాణి ఆధ్వర్యంలో నస్పూర్‌లోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్లా అజీజ్, సెక్రటరీ శ్యామ్ సుందర్‌రెడ్డి, ట్రెజరర్ కృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు దేవన్న, గౌరవ సలహాదారులు శ్రీనివాస్, జార్జ్, మీడియా సెక్రటరీ అంబాల రాజ్ కుమార్, జిల్లా మహిళా ఇన్‌చార్జి రజిని, వైస్ ప్రెసిడెంట్లు రాజన్న, శ్రీధర్‌రెడ్డి, జోబిన్, విష్ణు, జాయింట్ సెక్రటరీలు మణికంఠ సుఫిన్, సన్నీ, రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 2018 నుండి అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి మళ్ళీ అతన్ని ఎన్నుకున్నందుకు రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు మైదం రామకృష్ణ, పుట్ల సత్యనారాయణ, జిల్లాలోని వివిధ పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

తప్పక పరిహారం అందజేస్తాం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్



జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం మండలంల పర్యటించిన ఆయన తొమ్మిపూర్‌లో కొనసాగుతున్న ఎన్‌హెచ్-163జి రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారి 163జి 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, జిల్లా ప్రజలు రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం ఇస్తామన్నారు. నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా పరిహారం కొరకు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. షెట్పల్లి, గంగిపెల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, తాగునీరు, నీడ, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు సమయంలో సంబంధిత రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా సందర్శించి వంట శాల, గదులు, ఆహార నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ. నాగరాజు పాల్గొన్నారు.

డేటా నమోదులో నిర్లక్ష్యం తగదు

● ఎన్యూమరేటర్లు దగ్గరుండి పూర్తి చేయించాలి
● అదనపు కలెక్టర్ మోతీలాల్



జైపూర్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్ తనిఖీ


నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ద్వార సేకరించిన డేటా ఎంట్రీలో నిర్లక్ష్యం తగదని అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీ తీరును బుధవారం పరిశీలించిన ఆయన మండల పరిధి డేటా ఎంట్రీ వెనుకబడిందని అసహనం వ్యక్తం చేశారు. రోజుకు కనీసం 30 నుండి 40 కుటుంబాల వారి డేటా ఎంట్రీ చేయాలని, ఎన్యూమరేటర్లు దగ్గరుండి పూర్తి చేయించాలని తెలిపారు.

తాండూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో సింగరేణి క్వాటర్‌లో కుటుంబ కుల గణన సర్వే వివరాలను నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే పట్ల సామాజిక మధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు పరిచేందుకు ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సమగ్ర సర్వే ద్వారా రాష్ట్ర ఆర్థిక సామాజిక పరిస్థితి అవగాహతమవుతుందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాల ఆధారంగా ఆర్థిక ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ పనులను వేగవంతం చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పనులను వేగవంతం చేయాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ పనుల నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంఈఓ మల్లేష్, డీటీ ప్రసాద్, ఎంపీఓ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



తాండూర్‌లో డేటా నమోదు ప్రకియ పరిశీలన

సంక్షోభంలో తెలంగాణ విద్యా వ్యవస్థ

● ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కరిమల జూనియర్ కాలేజీలో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వం మరి ప్రజా పాలన అంటూ హడావిడి చేయడం తప్ప తెలంగాణలో మార్పు ఏమి లేదని అన్నారు. ప్రజా పాలనలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజుకొక్కరి చొప్పున కక్ష కట్టినట్టుగా విద్యార్థులను బలి తీసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యార్థులు ఒక్క పక్క ఫీజు బకాయిలు విడుదల కాకా అవస్థలు పడుతుంటే, మరో పక్క సంక్షేమ వసతి గృహలలో విద్యార్థులు ఫుడ్ సరిగ్గా లేక విషవలయంలో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని రోజులు ఎళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఎన్నికల సమయంలో తమ పార్టీ మ్యానిఫెస్టోను భగవత్ గీత, ఖురాన్, బైబిల్‌తో పోల్చిన వ్యక్తి అధికారంలోకి వచ్చాక మాత్రం హామీ ఇచ్చిన విధంగా ఒక్కే ధఫాలో స్కాలర్ షిప్స్ విడుదలనే కానీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్స్ పెంపు కానీ విస్మరించి విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకొని ఏడాదిలో నెలకు రెండు సార్లు ఢిల్లీ ఫ్లైట్ ఎక్కుతున్నాడు తప్ప విద్యారంగంపై సమీక్ష మాత్రం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డికి తన పదవిని కాపాడుకోవడం మీద ఉన్న శ్రద్ధలో పావలా వంతు విద్యార్థుల మీద ఉన్న విద్యారంగం బాగుపడేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు రంజిత్, వాసు, మహేష్, సాయి, రాకేష్, తిరుపతి, రవి, నగేష్, శేఖర్ పాల్గొన్నారు.

దేవాపూర్‌లో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల పనులను ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ చేతుల మీదుగా భూమి పూజ చేసి ప్రారంభించారు. దేవాపూర్ గ్రామంలోని అచ్యుతరావు గూడెం నుంచి లచ్చిరెడ్డి గూడెంను కలిపే సీసీ రోడ్డుతో పాటు నాయకపుగూడెం నుండి గట్రాపల్లి గ్రామ పంచాయతీలోని గ్రామాలను కలిపే రోడ్డు నిర్మాణాలకు పనులు ప్రారంభించారు. దీంతో పాటుగా తుడుంగూడెం గ్రామానికి వెళ్లే దారిలోని బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ జీఎం కులకర్ణి పాల్గొన్నారు.

పచ్చని ప్రకృతిని భావితరాలకు అందించాలి

● బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజర్ పూర్ణ చందర్



నవతెలంగాణ-కాసిపేట

పచ్చని ప్రకృతిని భావి తరాలకు అందించాలని బెల్లంపల్లి అటవీ క్షేత్రాధికారి పూర్ణ చందర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కాసిపేపట మండలంలోని ముత్యంపల్లి సెక్షన్‌లో గురువాపూర్ అటవీ ప్రాంతంలో తెలంగాణ మోడల్ స్కూల్ 53 విద్యార్థులకు వనదర్శిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రేంజర్ పూర్ణ చందర్ పలు అంశాలను వివరించారు. ఆటవీ శాఖ ఆధ్వర్యంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం చేస్తున్న పనులను ఒక్కొకటిగా చూపిస్తూ వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. చెక్ డ్యాం, నీటి కుంటలు వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం కట్టించామని, అలాగే బయటి పశువులు, మనుషుల ప్రభావం తగ్గించుటకు అడవి చుట్టూ కందకాలు త్రవ్వించామని, అడవి రక్షణలో భాగంగా ఎక్కువ ప్రదేశాన్ని చుట్టి రావడం కోసం రోడ్లు వేయడం జరిగిందని, అలాగే ఇతరులని లోపలికి ప్రవేశం లేకుండా గేటు ఏర్పాటు చేశామని ఇలా ఆడవిని జాగ్రత్తగా కాపాడడం వలన వన్యప్రాణుల సంతతి పెరిగిందని తెలిపారు. ఈ మధ్య కాలంలో పెద్దపులి కూడా వచ్చి తిరిగివెళ్ళిందని, పులి యొక్క పాదముద్రలు చూపిస్తూ, అడవి లోని వృక్ష జాతులు. సీతాకోక చిలుకలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఇలాంటి వనదర్శినీ కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు అడవుల రక్షణపై అవగహన కల్పిస్తున్న అటవీ శాఖ వారి సేవలను కొనియాడారు. విద్యార్థులకు భోజనం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి ప్రవీణ్ నాయక్, బీట్ ఆఫీసర్లు శ్రీధర్, యుగేందర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు నాగ మల్లయ్య గణేష్, సుష్మా, మాధురి, స్వరూపా రాణి, పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జాతీయ షూటింగ్ బాల్ ఛాంపియషిప్ పోటీలకు గురుకుల విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.రమా కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 43వ సబ్ జూనియర్ (బాలురు, బాలికల) జాతీయ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు బీహార్‌లోని బోధ్‌గయాలో నిర్వహిస్తున్న క్రీడలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినిలు డి.అక్షయ 10వ తరగతి, జె. శైలజ 10వ తరగతి, విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె.మహేశ్వర రావు, పీడీ, పీఈటీలు మమత, రమ దేవి ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులను ఎంపికైనందుకు అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలి

నవతెలంగాణ-జన్నారం

రాజ్యాంగ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్ అన్నారు. బుధవారం 26 నవంబర్ భారత రాజ్యాంగ వారోత్సవాలను పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన రాజ్యాంగ పరిరక్షకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత బోర్లకుంట ప్రభుదాసును శాలువాతో పూలమాలలతో సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఈ వారం రోజులు రాజ్యాంగ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది మాజీద్, జిల్లా అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మామిడిపల్లి ఇందయ్యా స్నేహ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దుమల రమేష్ స్నేహ యూత్ సభ్యుడు అంబేద్కర్ సంఘం నాయకులు ప్రవీణ్ దుమల్ల, శివ బచ్చల, పోశం రాహుల్ మామిడిపల్లి, రాజానర్సు, ఐలవేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దీక్ష దివస్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

నవంబర్ 29న నిర్వహించే దీక్ష దివస్ కార్యక్రమం విజయవంతం చేయాలని బీఆర్ఎస్ చెన్నూరు నియోజవర్గ సీనియర్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ పిలుపునిచ్చారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం చెన్నూరు నియోజవర్గ సీనియర్ నాయకులు రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు జె రవీందర్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు నవంబర్ 29న జరిగే దీక్ష దివస్ కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, సీనియర్ నాయకులు బండారు సూరిబాబు, తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్, ఎండీ అబ్బాస్, బర్ల సదానందం, భూపెల్లి కనకయ్య కొండలరావు, యూత్ నాయకులు బట్టురాజ్ కుమార్, సోషల్ మీడియా పట్టణ ఇన్‌చార్జి సీపేల్లి సాగర్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మోతీలాల్ పాఠశాల పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. పాఠశాలలో మెస్ కమిటీ రిజిష్టర్, డైలీ ఇష్యు రిజిష్టర్ పరిశీలించిన ఆయన ప్రతి రోజు విద్యార్థుల సంతకాలు సేకరించాలని తెలిపారు. అదేవిధంగా మెస్ సూపర్ వైజర్, ప్రిన్సిపాల్ సంతకాలు చేయాలని తెలిపారు. వంట పాత్రలు, వంట గది ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, ఆహారం వడ్డించే ముందు విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడం కోసం అందుబాటులో సబ్బు సానిటైజర్ ఉంచాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతిబాపురావు, పాఠశాల ప్రిన్సిపాల్ సర్వే నిర్వాహకులు, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) పాఠశాలలో విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ విద్యార్థులకు బాల్యవివాహాలు, బాలిక విద్యా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. బార్ కౌన్సిల్ అడ్వకేట్స్ లీగల్ లిటరసీ, సివిల్ సప్లై చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రమాకళ్యాణి, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గడిగొప్పుల కిరణ్‌కుమార్, రాజేశ్వరరావు, సురేందర్, పద్మ, శ్రీధర్, బార్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ నేరెళ్ల రాజేష్, అడ్వకేట్ రెడ్డిమల్ల ప్రకాశం, శివశంకర్, రవికుమార్, గణేష్, గాండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సంతోష్ హోటల్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి మంటలు చెలరేగాయి. యజమాని ఘటనా స్థలానికి చేరుకొని అక్కడున్న మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్ సీఐ బుద్ధ స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే వారు అగ్నిమాపక శాఖకు తెలియజేవారు. ఫైర్ ఇంజన్, డీబీఎల్ కంపెనీ వాటర్ ట్యాంకర్‌ల ద్వారా మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు అంటున్నారు.

మిగిలిన ఏజెన్సీ పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2008 డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థుల లిస్టు ప్రదర్శించి వెరిఫికేషన్ చేయాలని టిఎస్టిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ నరేష్ అన్నారు. మిగిలిన ఏజెన్సీ పోస్ట్ ఏజెన్సీ అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. ఈ విషయమై బుధవారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అడిషనల్ డైరెక్టర్, ట్రైబల్ కమిషనర్‌కు విన్నవించారు. జిల్లా ఏజెన్సీ అభ్యర్థులకు సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రస్తుతం 135 అభ్యర్థికి ఏవిధంగా సెలెక్ట్ చేశారో చెప్పాలన్నారు. దాంట్లో ఏజెన్సీ, మైదానం ప్రాంతాల పోస్టులు ఎన్ని ఉన్నాయో తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాథోడ్ మదన్, రాథోడ్ గణేష్, రాథోడ్ పరశురాం, ఆడే రాంచందర్, రాథోడ్, గోవిందరావ్ పాల్గొన్నారు.

డిసెంబర్ 1నాటికి ఇంటింటి సర్వే వివరాలు నమోదు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

సేకరించిన ఇంటింటి సర్వే వివరాలను డిసెంబర్ 1 నాటికి ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఎంపిడిఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదును కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఇంటింటి సర్వే వివరాలను ఒక్కో కుటుంబం వారీగా జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని తెలిపారు. వివరాల నమోదులో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే అధికారుల దృష్టికి తేవాలని, సకాలంలో నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కలీం, ఎంపిడిఓ, ఆపరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థిని కొమ్మ హరిక, ద్వితీయ స్థానంలో దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని తనియా బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమాన్ని మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబమూర్తి, సమన్వయకర్త అన్నం రమణారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణగోపాల్, జ్యోతి, కృష్ణ, కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

డీటీడీఓ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ ఉత్తీర్ణులై ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బంది సమావేశంలో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆదేశించారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగే జాతీయ స్థాయి సైకిల్ పోలో పోటీలకు వెళ్తున్న విద్యార్థులను అభినందిస్తూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించి తెలంగాణా రాష్ట్రం పేరును జాతీయ స్థాయిలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమం హెడ్మాస్టర్ రంగు సత్యనారాయణ, వార్డెన్ మల్లారెడ్డి, క్రీడాభివృద్ధి అధికారి జీవరత్నం, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల ప్రత్యేక అధికారిగా మత్స్య శాఖ ఏడీ సాంబశివరావు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బంది, అధికారులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ ఆలీ, సూపరిడెండింట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ సహాయకులు కె తిరుపతి, ఏపీఓ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పాఠశాలల, కళాశాలల విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించేందుకు డ్రగ్ ఫీస్ సొసైటీని ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలు, విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగం నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్లబ్‌ల ఏర్పాటు ఇతర వివిధ రకాల పద్ధతుల ద్వారా అవగాహన కల్పించాలని, విద్యాసంస్థలకు 200 మీటర్ల వ్యాసార్థంలో ఎలాంటి పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు జరుగకుండా పర్యవేక్షించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, 47 జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాలు నియంత్రించడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమైనదని, విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య పథకం క్రింద ప్రత్యేక నంబర్ 14416 ఏర్పాటు చేయడం జరిగిందని, ఆరోగ్య సంబంధిత అంశాలపై సందేహాలు, సేవల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలలో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని, జిల్లా సంక్షేమ అధికారిని నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు తెలిసే విధంగా వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించడంలో తమ వంతు పాత్ర పోషించాలని, ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలను వివరించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100, హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నం. 14446 లలో సమాచారం అందించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించేందుకు కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు వివిధ శాఖల అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఆహార భద్రతా కమిటీతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టల్, రెసిడెన్షియల్, ఆస్పత్రిని సందర్శించి, ప్రతి వారం తనిఖీ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు తదితర అన్ని సంస్థలలో ఆహారాన్ని అందించేందుకు ప్రమాణాలతో కూడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మల్టీ డిసిప్లనరీ టాస్క్ ఫోర్సును ఏర్పాటుచేసి రెండేళ్లలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగిన హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి సంఘటనలు గల కారణాలను, సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఆహార భద్రత కమిటినీ ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, ఆహార పదార్థాల నిల్వ, వంట పాత్రలను శుభ్రం చేయడం, ఆహారాన్ని వడ్డించడం వరకు క్షుణ్ణంగా అధికారులు తనిఖీ చేయాలన్నారు. వంట చేసే వ్యక్తుల హైజింగ్, వారి ఆరోగ్యం ఎలావుందీ పరిశీలించాలని అన్నారు. భవిష్యత్తులో హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

29న కుల గణన చైతన్య సదస్సును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే ముగింపు సందర్భంగా ఈ నెల 29న మంచిర్యాలలోని వైశ్య భవన్‌లో నిర్వహించే సమగ్ర కుల గణన చైతన్య సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్ కోరారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి విశ్రాంతిభవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితం జరిగిన సమగ్ర కుల గణన కార్యక్రమం ఈ సర్వే వల్ల బీసీలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన రాజకీయ, విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లు వారికే దక్కుతాయని దీనికోసమే ఈ కులగన సర్వే ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అన్ని వర్గాల వారికి ఈ సర్వే వల్ల లాభం చేకూరుతుందని 29న జరిగే చైతన్య సదస్సును ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణం రవి, శంకర్‌గౌడ్, లింగన్న, నరసయ్య సుధాకర్, అలీం పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-నేరడిగొండ

చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని లంబాడా ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ కలెక్టర్ రాజర్షి షాను కోరారు. బుధవారం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన సందర్భంగా మహేందర్ కలిసి బిల్లులు విషయమై విన్నవించారు. గ్రామపంచాయతీ భవనం, అమ్మ ఆదర్శ పాఠశాల, సైడ్ డ్రెన్, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు అప్పులు చేశామన్నారు. పనులు చేసిన వారందరూ పేద, మధ్యతరగతికి చెందిన వారమేనని తెలిపారు. రెండు సంవత్సరాల నుండి గ్రామపంచాయతీలో పెండింగ్ బిల్లులను, మాజీ సర్పంచుల జీతాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ వసంతరావు, రాథోడ్ కృష్ణ, నాయక్ జాదవ్‌రామ్, నాయక్ రఘునాథ్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే డేటా ఎంట్రీ పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు బుధవారం పరిశీలించారు. ఆపరేటర్లు ఆన్ లైన్ ప్రొఫార్మాలో ఉన్న విధంగా తప్పులు లేకుండా కుటుంబాల వివరాలు నమోదు చేయాలని, షెడ్యూల్ ప్రకారం 3వ తేదిలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ బోజన్న, ఎంపీఓ షేక్ సఫ్దర్ ఆలీ, సూపరింటెండెంట్ ఆకుల లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జన్నారం : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు రాకుండా నమోదు చేయాలని ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్న కుల గణన ఆన్‌లైన్ సర్వే నమోదు ప్రక్రియను పరిశీలించారు. కుల గణన సర్వే పటిష్ఠంగా నిర్వహించామని, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు రాకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.



సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఈనెల 23, 24 తేదీల్లో మెదక్‌లోని మూసాయిపేటలో జరిగిన సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించగా వారిని జిల్లా విద్యాధికారి యాదయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ జూలూరు యాదగిరి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న, శ్రీశాంత్, కార్తీక్ శ్రావణ్, యువరాజ్, నాగరాజ్ ఉమకంత్, విష్ణు వర్ధన్ ఘనత సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, అధ్యాపకులు కోసరి మహేష్, చంద్రశేఖర్, పాల్గొనగా వీరిని సట్ల శంకర్, యాదగిరి ప్రసాద్, మంచిర్యాల జిల్లా సాఫ్ట్ బాల్ కార్యదర్శి బి.కిరణ్ కుమార్ అభినందించారు.

జిల్లాలో కుష్టు వ్యాప్తిని నిరోధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కుష్టు వ్యాధి వ్యాప్తిని నిర్వహించేందుకు అధికారులకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గల లోనవెల్లిలో కొన్ని కేసులను గుర్తించడం జరిగిందని, దిశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో ప్రజలకు కుష్టు వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించాలని, శరీరంపై మచ్చలు కనిపించిన వెంటనే చికిత్స చేసుకునే విధంగా తెలియజేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలలో విద్యార్థులకు వివరించాలని, గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ సెక్రటరీల ద్వారా డిసెంబర్ 2 నుండి 15 తేదీ వరకు 15 రోజుల పాటు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. దహెగాం, కౌటాల, లోనవెల్లి గ్రామాల్లో 102 కేసులు గుర్తించడం జరిగిందని నియంత్రణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిరిజన గ్రామాల్లో గిరిజనుల రక్త నమూనాలు సేకరించి సికిల్ సెల్ పరీక్ష నిర్వహించి నివేదికలు అందించాలన్నారు. జిల్లాలో 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ నెల 29 నుండి 3 రోజుల పాటు ఫైలేరియా వ్యాప్తి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుండి సహాయం అందించడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి ఎవరికైనా రావచ్చని, ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుందని, వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున 3 నుండి 5 సంవత్సరాల సమయం పడుతుందని తెలిపారు. ఈ వ్యాధి ఎండీటీ చికిత్సతో 6 నెలల నుండి 12 నెలలో పూర్తిగా నయం అవుతుందని, ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే విలువైన ఫలితాలు ఉంటాయన్నారు. జిల్లాలో కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి నెట్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలబాలికలకు నెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లిదుర్గం మహేశ్వర్ ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు అర్హులేనని, పోటీలలో పాల్గొనేవారు తమ ప్రధానోపాధ్యాయుల చేత ఎంట్రీ ఫామ్, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి 9949300668ని సంప్రదించాలన్నారు.

అటవీ హక్కులపై అవగాహన

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలోని పెద్దాపూర్ గ్రామంలో కొలాం గిరిజనులకు అటవీపై పూర్తి హక్కుల అంశంపై సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, బీఆర్‌ఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి అవగాహన సమావేశం నిర్వహించారు. అటవీ సంపదైన కంకబొంగు, తేనే, పరికి పండ్లు, బంక, అల్లే తడకలు, గంపలు, మొదలగునవి వాటిపై పూర్తి హక్కులు కొలాం గిరిజనులకు ప్రభుత్వం కల్పించి, వీటిని ప్రభుత్వమే గ్రామాలకు అధికారులను పంపి కొనే విధంగా చర్యలు చేపట్టాలనే అంశంపై అవగాహన కల్పించారు. పెద్దాపూర్, కొలాంగూడ, పావుగూడ, జెండాగూడలో 8రకాల అటవీ హక్కులను వివరించారు. దీనిపై కొలాం గిరిజనుల వద్ద నుంచి వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ పీవో చంద్రకాంత్, కవిత, మహేందర్, ఆదివాసీ నాయకులు మడావి అనంత్‌రావ్, ఆత్రం మహేష్, భగంతరావు, భీంరావు, గ్రామ పటేళ్ల, ప్రజలు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్య వర్ధంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ 1న నిర్వహించే పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని విజయవంతం చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పులి సతీష్ అన్నారు. పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు ఒకటిన ప్రతి గ్రామం, మండల కేంద్రంలో అమరవీరుల స్తూపాల వద్ద పోలీస్ కిష్టయ్య వర్ధంతి జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల ఉపాధ్యక్షుడు ఏటకర్ల రవి, బొండ్ల రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి నెల్లి రవి, కన్వీనర్ తిరుపతి, నాయకులు బోన్ల శీను, గుమ్మల బాలేష్, మండల కార్యదర్శి తిరుపతి, ఏట శంకర్, నరేష్, పులి సాయిరాం పాల్గొన్నారు.